క్లుప్తంగా

అనధికార కట్టడాలు, లే అవుట్లను ఉపేక్షించేది లేదు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలను, లే అవుట్లను ఉపేక్షించబోమని, ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరిగితే ప్రజలు నేరుగా కమిషనర్ పర్యవేక్షణలో ఉండే 9849908391 నంబర్‌కి వాట్సప్ ద్వారా తగిన ఆధారాలతో(ఫొటోలు, వీడియోలు) ఫిర్యాదు చేయవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో నిర్మాణాలు నగరపాలక సంస్థ నుంచి నిర్దేశిత అనుమతులు పొందిన అనంతరమే చేపట్టాలని, అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తే నిర్మాణాన్ని కూల్చివేయడంతో పాటు నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బాధ్యులైన సిబ్బంది, అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనధికార నిర్మాణాలు, లే అవుట్లపై ఫిర్యాదులు స్వీకరణకు ప్రత్యేకంగా కమిషనర్ చాంబర్‌లోని 98499 08391 నంబర్ ని కేటాయించామన్నారు. సదరు ఫిర్యాదులను నేరుగా తామే పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ నిర్మాణ, లే అవుట్ల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే నిర్దేశిత గడువులోపు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కాసు శాయమ్మ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన తూర్పు మండలస్థాయి క్రీడా పోటీల్లో కాసు శాయమ్మ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ జిలానీ తెలిపారు. కొత్తపేటలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిలానీ మాట్లాడుతూ అండర్-17 బాలికల విభాగ 100, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ స్థానాలతో పాటు 3కే పరుగులో ద్వితీయ, తృతీయ స్థానాలు, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. అండర్-17 బాలుర విభాగ 1500 మీటర్ల విభాగంలో తృతీయ స్థానాన్ని సాధించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా క్రీడా శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వి జయకుమార్‌తో పాటు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరు పండరీపురానికి చెందిన గుండ లక్ష్మీనారాయణ, ప్రభావతమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116ల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు.

ముగిసిన ఇన్‌ట్యాక్ జాతీయస్థాయి వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: భారత జాతీయ కళ, సాంస్కృతిక వారసత్వ సంస్థ (ఇన్‌ట్యాక్) ఆధ్వర్యంలో ఢిల్లీలో వివిధ రాష్ట్రాల్లోని ఇన్‌ట్యాక్ ప్రతి నిధులకు కెపాసిటీ బిల్డింగ్‌పై మూడురోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ గురువారం ముగిసింది, ఈసందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఇన్‌ట్యాక్ శాఖల సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇన్‌ట్యాక్ చైర్మన్ అశోక్‌సింగ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా సమక్షంలో గుంటూరు నుంచి పాల్గొన్న ఇన్‌ట్యాక్ ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, ఇన్‌ట్యాక్ సభ్యులు మేకల రవీంద్రబాబు, ఎన్. సుకీర్తి, కె.ప్రవీణ, డాక్టర్ రేణుకారాణి, ఎస్. మహిపాల్ రెడ్డి, ఈ. రమేష్, ఎం. వెంకట సుబ్బారెడ్డి, నాగభూషణం, వెంకట్రామిరెడ్డి సర్టిఫికెట్లు అందుకున్నారు.


డీఎస్పీ ఎఫ్‌బీ హ్యాక్

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ ఫేస్ బుక్ ఎకౌంటు హ్యాక్ అయ్యింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఫేస్ బుక్ అకౌంట్‌ను హ్యాక్ చేసి ఆయన ఖాతాలోని స్నేహితులకు డబ్బులు కావాలంటూ తప్పుడు మెసేజ్‌లు పంపుతున్నారు. దీనిని గుర్తించిన డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ తన ఫేస్‌బుక్ ఖాతాను ఎవరో హ్యాక్ చేశారని ఏ ఒక్కరు డబ్బులు పంపొద్దు అని స్పష్టంగా మెసేజ్ చేశారు. అప్పటికే ఆయన గ్రేహౌండ్స్‌లో పనిచేసిన సమయంలో తెలిసిన ఒక కానిస్టేబుల్ కు డబ్బులు కావాలని మెసేజ్ వెళ్లడంతో పంపించిన పరిస్థితులు ఉన్నాయని తెలిసింది. దీనిపై అప్రమత్తమైన ఆయన ఫేస్‌బుక్ ఎకౌంట్ హ్యాకింగ్ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఏ ఒక్కరు తప్పుడు ఖాతా ద్వారా మెసేజ్లు వస్తే స్పందించవద్దని తెలిపారు.

రెవెన్యూలో రాబందులు

- ట్యాక్స్ వేయాలంటే ముడుపు కట్టాల్సిందే
- ప్రస్తుతం అడిషనల్ అల్ట్రేషన్ పేరుతో పన్నులు పెంచుతున్న ఆర్‌ఐలు
- డబ్బులు ఇస్తే ఒక రేటు.. ఇవ్వకపోతే భారీ మొత్తంలో పన్ను పెంచేస్తున్న వైనం
- పై అధికారులకు కూడా ముడుపులు ముట్టడంతో సిబ్బంది ఆడిందే ఆట.. పాట

ప్రభుత్వ ఆదేశాలు కొందరికి జేబులు నింపుతున్నాయి. కార్పొరేషన్ ఖజానాకు పన్నులు రూపంలో ఆదాయం వస్తుందని భావించి ఇచ్చిన సదరు ఆదేశాలు పలువురు సిబ్బందికి చక్కని ఆదాయాన్ని సముపార్జించిపెడుతున్నాయి. ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఇది వారి ఆదాయానికి 'అడిషనల్ అల్ట్రేషన్'గా మారిపోయింది. పన్నుల విధింపులో వారు చూపిస్తున్న చేతివాటం వల్ల కార్పొరేషన్ ఆదాయానికి గండిపడుతున్న వైనాన్ని పాలక పెద్దలు ఎవరూ గ్రహించడం లేదు. దీంతో వారు వేసిందే పన్నుగా గుంటూరు నగరంలో మారిపోయింది.



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ సెక్షన్‌లో ఆర్‌ఐలు, రెవెన్యూ అధికారులు ఇంటి పన్నులు వేయడంలో, టైటిల్ ట్రాన్స్ఫర్, అడిషనల్ అల్ట్రేషన్ చేతివాటం ప్రదర్శిస్తూ వచ్చిన కాడికి దండుకుంటూ తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టి ఎక్కడైనా ఇంటికి పన్ను లేకపోతే పన్ను విధించడంతో పాటు, అదనపు అంతస్తులకు పన్ను పెంచాలని (అడిషనల్ అల్ట్రేషన్), నిర్మాణం విస్తీర్ణం మేరకే పన్ను విధించారా లేదా అని కుణ్ణంగా పరిశీలించి పన్ను పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

పన్ను పెంపు కార్యక్రమం ద్వారా గుంటూరు నగరపాలక సంస్థకు రెవెన్యూ సెక్షన్ నుంచి వస్తున్న ఆదాయం కాకుండా అదనంగా రూ. 31 కోట్లుకు పైగా వసూలు చేయాలని టార్గెట్లు ఇచ్చింది. సదరు ప్రభుత్వ ఆదేశాలతో గుంటూరు నగరంలో ఉన్న నివాస గృహాలపై నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు ప్రతిరోజు తనిఖీలు చేపట్టి డబ్బులు ఇచ్చిన వారికి ఒక రేటు.. ఇవ్వని వారికి భారీ మొత్తంలో పన్ను పెంచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కో ఆర్‌ఐ కింద ఇద్దరు నుంచి ముగ్గురు అసిస్టెంట్స్‌లు

నగరపాలక సంస్థ పరిధిలో 2,05,663 ఇంటి పన్నులు ఉన్నాయి. వీటి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్‌కు కరెంట్ డిమాండ్ కింద రూ.128 కోట్లు కాగా దీనికి ఏరియర్స్‌తో (పన్ను బకాయిలు) కలుపుకుని రూ.190 కోట్లు దాకా ఉంది. దీని ప్రకారం పన్నులు వసూలు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం పన్నులు లేని వాటికి పన్నులు వేయాలని, అదనపు అంతస్తులకు పన్ను పెంచాలని సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) వివరాలతో కూడిన జాబితా ఇచ్చినప్పటికీ పన్నులు లేని భవనాలకు పన్నులు వేయకుండా వారి వద్ద నుంచి మామూళ్లు తీసుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఒక్కో ఆర్‌ఐ కింద ఇద్దరు, ముగ్గురు అసిస్టెంట్లు ఉండటంతో వారే ఆర్‌ఐలు చేయాల్సిన పనులను అంతా చక్కబెట్టి దరఖాస్తు దారు నుంచి వేల నుంచి లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల అదనపు కమిషనర్ నిర్వహించిన అధికారిక సమావేశంలో ఓ బిల్‌కలెక్టర్ (అడ్మిన్) కింద పనిచేసే అసిస్టెంట్ ఆ సమావేశంలో అదనపు కమిషనర్ ముందే కూర్చున్నాడంటే అధికారులు ఎంత ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



వాటర్ ట్యాంక్‌కు రక్షణగా వేసిన షెడ్ ఇదే

డబ్బిస్తే ఓ రేటు.. ఇవ్వకపోతే మరో రేటు

టైటిల్ ట్రాన్స్ఫర్ (ఇంటి పన్ను పేరు మార్పు), కొత్త ఇంటి పన్ను వేయాలంటే డబ్బులు ఇచ్చుకుంటునే పన్నులు వేస్తున్న పరిస్థితి. ఇంటి పన్ను దరఖాస్తుకు సచివాలయంలో అడ్మిన్లు చేస్తుంటారు. అయితే సదరు ఇంటి పన్నుకు దరఖాస్తు చేయాలంటే ముందుగా ఆర్‌ఐ అసిస్టెంట్‌ను కలిసి అతను/ఆమె ఓకే అంటేనే సచివాలయ అడ్మిన్ దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఒక వేళ దరఖాస్తుదారుడు నేరుగా సీడీఎంఏ పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకుంటే దానిని వివిధ సాకులు చూపి రిజెక్ట్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దరఖాస్తుదారులు చేసేదేమి లేక వారు అడిగినంత ఇచ్చుకుని పని చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వాటర్ ట్యాంకు షెడ్డుకూ.. పన్నువేశారు!



కొరిటెపాడులో మా బిల్డింగ్‌పైన ఉన్న వాటర్ ట్యాంక్‌కు రక్షణ కోసం ట్యాంక్ కవర్ అయ్యే విధంగా షెడ్ వేసుకున్నా. అక్కడ మేము నివాసం ఉండటం లేదు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు వచ్చి సదరు షెడ్ ఫోటో తీసుకుని పన్ను పెంచారు. గతంలో నేను రూ.1349 ట్యాక్స్ చెల్లించే వాడిని.. ఇప్పుడు ఆ షెడ్‌కు అదనంగా పన్ను వేయడం ద్వారా రూ.3910 ట్యాక్స్ పెంచుతూ డిమాండ్ నోటీసు ఇచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్, నగర కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశా.

– జి.సి.హెచ్ గోపాలరావు, కొరిటెపాడు

ఐఎస్‌ఏ ఆధ్వర్యంలో స్ట్రోక్‌పై అవగాహన

ఐఎస్‌ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ శ్రీవాత్సవ్, డాక్టర్ విజయ, డాక్టర్ రాఘవ శర్మ

గుంటూరు మెడికల్: పక్షవాతంపై(స్ట్రోక్) ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి తద్వారా స్ట్రోక్ మరణాలు తగ్గించటమే లక్ష్యంగా ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్(ఐఎస్‌ఏ) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. గురువారం స్థానిక కొత్తపేట లలితా సూపర్ స్పెషాలిటి హాస్పటల్‌లో వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా ప్రజలకు స్ట్రోక్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ పక్షవాతం అవగాహన పోస్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి, గుంటూరు జీజీహెచ్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రజల్లో పక్షవాత లక్షణాలపై అవగాహన పెంచి, తొందరగా గుర్తించి సమయానికి చికిత్స పొందడం ద్వారా అంగవైకల్యం, మరణాలను తగ్గించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. పక్షవాత నిర్ధారణకు అవసరమైన సీటీ స్కాన్ పరీక్షలు, థ్రాంబోలైసిస్ కోసం అవసరమైన క్లాట్ బస్టింగ్ ఔషధాలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. పక్షవాత లక్షణాలను ఆలస్యంగా గుర్తించడం, స్ట్రోక్ రెడీ ఆసుపత్రికి సమయానికి చేరుకోకపోవడమేనని మరణాలకు కారణాలని వెల్లడించారు. అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అక్టోబర్ నెలను పక్షవాత అవగాహన మాసంగా జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ''బ్రెయిన్ స్ట్రోక్ – టైమ్ టు యాక్ట్' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోస్టర్లో పక్షవాతం అంటే ఏమిటి, పక్షవాత లక్షణాలను గుర్తించే విధానం, గోల్డెన్ అవర్ ప్రాధాన్యత, అలాగే పక్షవాత చికిత్సకు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సలు గురించి వివరించారన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాత్సవ్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మీ, డాక్టర్ ఎన్.టి.ఆర్. వైద్య సేవ గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాశ్, లలితా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రాఘవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



నూరి ఫాతిమాకు జ్ఞాపిక అందజేస్తున్న చర్చి నిర్వాహకులు

పట్నంబజార్: ఏసుక్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నగరంలోని 31వ డివిజన్ ఏటీ అగ్రహారంలో గురువారం జరిగిన సెయింట్ మ్యాథ్యూస్ లూథరన్ సౌత్ ప్యారిస్ చర్చి ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవానికి హాజరైన నూరి ఫాతిమాను పాస్టర్లు, చర్చి నిర్వాహకులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎర్రబాబు, కోటా రామదాస్, చర్చి సంఘ కాపరి, సంఘ సభ్యులు తోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్ బాబు తల్లి వెంకటరమణ అకాల మరణం చెందిన నేపథ్యంలో గురువారం వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా ఆమె భౌతికాయాన్ని సందర్శించారు. నల్లచెరువులోని మహేష్ నివాసానికి వెళ్లి ఆయన తల్లి వెంకటరమణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేష్ బాబు తో మాట్లాడి సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి



సీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ డిమాండ్

లక్ష్మీపురం: గత 20 సంవత్సరాలుగా ఏపీ సీఎన్ఎఫ్‌లో పనిచేస్తున్న సిబ్బందికి కష్టాలు తప్పడం లేదని విజయనగరం జిల్లాలో ఇరవై మంది సిబ్బందిని అకారణంగా ఎలాంటి తప్పు చేయకుండా తొలగించారని వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఏ.శ్రీధర్, వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షులు అంజిబాబు డిమాండ్ చేశారు. గుంటూరులోని అర్‌వైఎస్ఎస్ రాష్ట్ర కార్యాలయంలోని సీఈఓ రామారావుకు గురువారం యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఎలాంటి తప్పు చేయకున్నా ప్రకృతి వ్యవసాయన్నీ ప్రోత్సహిస్తూ నమ్ముకొని ఉపాధి పొందుతూ పని చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బందిని అకారణంగా తొలగించడం చాలా బాధాకరమైన విషయమన్నారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని పెండింగ్‌లో ఉన్న వేతనాలు గత ప్రభుత్వంలో పది నెలలు ఉన్నా యని తక్షణమే వేతనాలు విడుదల చేయాలని కోరారు. గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది అనేక కష్టనష్టాలకు ఓర్చి పని చేస్తున్నారని నెలనెలా వేతనాలు విడుదల చేయాలని డీఎంఎంటీలకు పెండింగ్ టీఏలు డీఏలు విడుదల చేయాలన్నారు. మహిళలు అసౌకర్యాల మధ్యన మౌలిక వసతులు లేకున్నా పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ముందుకు నడిపిస్తున్నారని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీరికి అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగుల సదుపాయాలు కల్పించాలన్నారు. ఇవే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల అకారణంగా నమ్మకంగా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తున్నారని ఐసీఆర్పి నుండి ఎంటిల వరకు ప్రభుత్వ గుర్తింపు కార్డు మంజూరు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దాదాపు 250 మందికి వివిధ కారణాలతో గతంలో విడుదల చేసిన వేతనాలు జమ కాలేదని తక్షణమే పరిశీలన చేసి ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలన్నారు. ఈ విషయాలపై సీఈఓ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, రాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యసాధకుడు కాన్షీరాం

రజక జనసేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు



ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న కాన్షీరాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: బహుజనులకు రాజ్యాధికారం కల్పించిన మహనీయుడు మాన్యశ్రీ కాన్షీరాం అని రజక జనసేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాన్షీరాం వర్ధంతి పురస్కరించుకుని ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మాయావతిని నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాన్షీరాంకే దక్కుతుందన్నారు. భారత రాజకీయాలను మలుపు తిప్పి బాబా సాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన ఓటు హక్కు ద్వారా రాజ్యాన్ని కై వసం చేసుకోవచ్చని నిరూపించిన గొప్ప దర్శనికుడు కాన్షీరాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జి ఆర్ భగత్ సింగ్, రజక జన సేవా సంఘం నాయకులు వట్టికూటి సాంబయ్య, బహుజన ప్రజా చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు దొంత సురేష్, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదం మాల్యాద్రి తదితర నాయకులు పాల్గొన్నారు.

సంజీవయ్యనగర్‌లో నిరసన

సంజీవయ్యనగర్ మెయిన్ రోడ్డులో అక్టోబర్ 8వ తేదీన బహుజన సమాజ్ పార్టీకి చెందిన జెండా దిమ్మెను నగరపాలక సంస్థ వారు కూల్చివేసినప్పటికి ఇంత వరకు దాని నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆ పార్టీ నాయకులు గురువారం కూలిచ్చేసిన దిమ్మె వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాన్షీరాం వర్ధంతి కార్యక్రమం చేయనీయకుండా పాలకులు అడ్డుపడటం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నేపల్లి శ్యామ్, పచ్చిగొళ్ల రవితేజ, అహ్మద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

సైనికులను యువత ఆదర్శంగా తీసుకోవాలి

'ప్రాసమణి' అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు



సుబ్రహ్మణ్యేశ్వరరావును సత్కరిస్తున్న రాయపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం కోసం నిస్వార్థంగా ప్రాణాలు అర్పిస్తున్న సైనికులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని 'ప్రాసమణి' అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వర రావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్యేశ్వర రావు తన ప్రాస వ్యాఖ్యానంతో విద్యార్థులను హుషారెత్తించారు. తల్లిదండ్రులను ప్రేమించడంతో పాటు మాతృదేశాన్ని అభిమానిస్తూ, భారత సైనికుల వీర త్యాగాలను గుర్తించడం, విద్యాదానం చేసే అధ్యాపకులను గౌరవించడం విద్యార్థులు విధి అన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు కళాశాల యాజమాన్యం కృషి చేస్తోందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక వసతులతో చదువుతో పాటు ఉద్యోగాలను కల్పించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గోపీచంద్ మాట్లాడుతూ స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించనున్నామని తెలిపారు. కళాశాలలో అందిస్తున్న విద్యాబోధన, గ్రంథాలయం, పరిశోధన శాలలు వంటి వసతులను గురించి వివరించారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయేరియాతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



రెడ్డి కోటేశ్వరరావు (ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో డయేరియా చాప కింద నీరులా విస్తరిస్తోంది. జీజీహెచ్‌లో డయేరియాతో చికిత్స పొందుతున్నప్పటికీ కొంత మంది మరణిస్తున్నప్పటికీ అధికారులు డయేరియా కట్టడికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే చెప్పుకోవచ్చు. ఇటీవల చౌత్ర సెంటర్‌లో ఓ వృద్ధురాలు డయేరియా లక్షణాలతో చనిపోయి న విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచిన విషయం తెలిసిందే. తాజాగా మల్లిఖార్జునరావుపేటకు చెందిన ఓ పారిశుద్ధ్య (ఆప్కాస్) కార్మికుడు డయేరియాతో బాధపడుతూ మృతి చెందారు. మల్లిఖార్జునపేట 5/3వ లైనులో నివాసముండే రెడ్డి కోటేశ్వరరావు స్థానికంగా పారిశుద్ధ్య కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన వాంతులు, విరోచనాలతో బాధపడుతుండటంతో అమరావతి రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా కిడ్నీ సమస్యతో బాధపడుతుండటంతో డాక్టర్లు జీజీహెచ్‌కు రిఫర్ చేయడంతో తీసుకువెళ్లామని కోటేశ్వరరావు కుమారుడు రెడ్డి గోపి తెలియజేశారు. జీజీహెచ్‌లో రెండు సార్లు డయాలసిస్ చేశారని 9వ తేదీ ఉదయం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో గొంతులో పైపు వేసి వేరో వార్డుకు తీసుకువెళ్లేలోపు మధ్యలో చనిపోయినట్లు గోపీ తెలియజేశారు.

జీఎస్టీ తగ్గుదలతో ధరల్లో మార్పులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీఎస్టీ పరిధి తగ్గుదలతో వివిధ రకాల వస్తువులు, సేవల ధరల్లో భారీస్థాయిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర జీఎస్టీ సహాయ కమిషనర్ వి. మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం జీఎస్టీ 2.0 సరళీకృత పన్ను విధానం ద్వారా వినియోగదారులు పొందే ఆర్థిక ప్రయోజనాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోజ్‌కుమార్ మాట్లాడుతూ చట్టంలో వచ్చిన మార్పులు, వినియోగదారుల వర్గీకరణ, ఆర్థికపరంగా పొందే ప్రయోజనాలు, చట్టం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధి, ఆర్థిక వనరుల సమీకరణకు దోహదం చేస్తుందని తెలిపారు. జీఎస్టీ పన్నుల పరిధిపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రాష్ట్ర కళాశాల విద్య, ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు జీఎస్టీ పన్నుల తగ్గుదలపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా జీఎస్టీ 2.0పై కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల ఎదుగుదలకు కృషి



నగరంపాలెం: సృష్టికర్త విరాట్ విశ్వకర్మ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వంశస్థులుగా ఉన్న విశ్వబ్రాహ్మణులు సృష్టికి ప్రతి సృష్టి చేయగల సమర్థులని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. అరండల్‌పేటలోని శ్రీఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ప్రాంగణంలో గురువారం దివంగత శ్రీగిరి నాగమాంబ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన సమాజం అధ్యక్షులు జంపని రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని అన్నారు. పాలకవర్గంలో తొలిసారి మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గల్లా రామచంద్రరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తిరువల్లూరి పద్మావతి, డివిజన్ కార్పొరేటర్ శ్రీవల్లి, దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం గౌరవాధ్యక్షులు కోళ్లపూడి గణపతిరావు, ఉపాధ్యక్షులు కొలగాని నందవీరప్రసాద్, అద్దంకి భద్రయ్య, కోళ్లపూడి హేమసుందర్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాససుధాకర్ బాబు, కార్యదర్శి పూసపాటి గిరిధర్, కోశాధికారి కందెపు వెంకటరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గౌడ్‌గా కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయాలి

పెదకాకాని: ప్రభుత్వం గౌడ కులస్తులందరికీ గౌడ్ గా కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయడంతో పాటు సంక్షేమ పథకాలకూ పరిగణించాలని రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యామా మురళిగౌడ్ కోరారు. భవిష్యత్‌లో సామాజిక వర్గం ఇబ్బందులు పడకుండా అందరికీ గౌడ్ (బీసీ బీ) ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని గురువారం రాష్ట్ర స్టాంప్స్ అండ్ రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అలానే బీసీ వెల్‌ఫేర్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ కలసి గౌడ్ కులస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వినతిప్రతం అందజేసిన వారిలో గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు న్యాయవాది మోర్ల వెంకటకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.